## క్లుప్తంగా

### నేడు ఆసరా చెక్కుల పంపిణీ

కాజులూరు: గొల్లపాలెంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరగనున్న వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పార్టీ మండల బీసీ సెల్ కార్యదర్శి గుబ్బల ఏసురాజు కోరారు. వెంకటపద్మావతి రైసుమిల్ గ్రౌండ్‌లోని సభా ప్రాంగణంలో ఏసురాజు తదితర నాయకులు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంత్రి చెల్లుబోయిన వేణు ఈ భారీ బహిరంగ సభలో పాల్గొని స్వయంశక్తి సంఘాలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తారన్నారు.

### రాయవరంలో 4న..

రాయవరం: వైఎస్సార్ ఆసరా మూడో విడత సాయాన్ని చెక్కుల రూపంలో అందించేందుకు ఈ నెల 4న మండలంలోని పలు గ్రామాల్లో సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాజర్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై మహిళలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఈ నెల 4 తొమ్మిది గంటలకు నదురుబాద, 10 గంటలకు వెదురుపాక, 11 గంటలకు వి.సావరం, 1గంటకు రాయవరం, 2గంటలకు లొల్ల, 3 గంటలకు సోమేశ్వరంలో వైఎస్సార్ ఆసరా సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

### వరసిద్ధి వినాయకునికి మంత్రి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న మంత్రి వేణు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో కొలువైన వరసిద్ధి వినాయక ఆలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. సర్పంచ్ నానాపరపు కళ్యాణి, రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్, నానాపరపు శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### శెట్టిబలిజ కల్యాణ మండపాలకు రూ.50 లక్షల మంజూరు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని రెండు శెట్టిబలిజ కల్యాణ మండపాలకు రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ పట్టణంలోని కల్యాణ మండపానికి రూ.25లక్షలు, రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి రూ.25 లక్షలు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేసినట్లు మంత్రి వేణు తెలియజేశారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ అందిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

రాయవరం:స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ వేసవి ముగిసే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. సుమారుగా మూడు నెలల పాటు దీన్ని కొనసాగిస్తామని, రోజూ మజ్జిగ, మంచి నీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొద్దు శ్రీను, వైఎస్సార్ సీపీ నేతలు తమలంపూడి గంగాధరరెడ్డి, కొల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో లక్షతులసి పూజ



ఆకట్టుకున్న సాంస్కృతిక కళా ప్రదర్శన

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద సీతారామ క్షేత్రంలో కొలువైన సీతారామ చంద్రస్వామి వారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం లక్షతులసి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీరామ మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు చేశారు.

**అలరించిన నర్తనోత్సవం**

వేడుకల్లో భాగంగా కోకిల వాణి కళాక్షేత్రం నిర్వాహకుడు కేఆర్‌కేవీఎస్ రాజు శిష్యబృందం ప్రదర్శించిన సాంస్కృతిక కళారూపాలు భక్తులను అలరించాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహాపూర్ణాహుతి, స్వామివారికి చక్రస్నానం నిర్వహించనున్నట్టు గణేశ్వరరావు తెలిపారు.

# అటెన్షన్..

- రేపటి నుంచి మోగనున్న టెన్త్ పరీక్షల బెల్
- క్లస్టర్ పరిధిలో 5,379 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

రాయవరం: విద్యార్థి దశలో తొలిసారి ఎదుర్కొనే పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల బెల్ మోగనుండడంతో సర్వత్రా టెన్షన్ మొదలైంది. అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. సీసీఈ విధానంలో నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు పేపరు చదువుకోవడానికి 15 నిమిషాల సమయం కేటాయించడం గమనార్హం. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో 29 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

**5,379 మంది విద్యార్థులు..**

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన 282 కేంద్రాల్లో 5,379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. రామచంద్రపురం, మండపేట మండలాల్లో తొమ్మిదేసి వంతున, రాయవరం, కె.గంగవరం మండలాల్లో నాలుగేసి వంతున, కపిలేశ్వరపురం మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాయవరం మండలంలో 758, రామచంద్రపురం 1,721, మండపేట 1,829, కె.గంగవరం 507, కపిలేశ్వరపురం మండలం నుంచి 564 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

**అరగంట ముందే చేరుకోవాలి**

పరీక్ష కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలని ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్లు సూచిస్తున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయి.

**ఓఎంఆర్ షీట్ పూర్తిచేయాలిలా..**

టెన్త్ విద్యార్థులు పరీక్షకు ముందుగా ఓఎంఆర్ షీట్స్ పూర్తి చేయాలి. తప్పుగా పూర్తిచేసినా, కొట్టివేతలు ఉన్నా ఫలితం మారిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఓఎంఆర్ షీట్లు పూర్తి చేయడంపై శిక్షణ ఇచ్చారు. మూల్యాంకన సమయంలో మార్కులు లీక్ కాకుండా, అవకతవకలు జరగకుండా విద్యాశాఖ బార్ కోడింగ్ విధానాన్ని అమలు చేసింది. అన్ని సబ్జెక్టులకూ బార్ కోడింగ్ విధానంల అమల్లో ఉంది. ఓఎంఆర్ షీట్‌లో మూడు భాగాలుంటాయి. మొదటి భాగం కుడివైపు ఉన్న గడిలో విద్యార్థి పరీక్ష రాసే గది సంఖ్య రాయాలి. దాని కింద ఇన్విజిలేటర్ సంతకం చేయాలి. బార్ కోడ్ షీట్ కుడి భాగంలో విద్యార్థి సమాధాన పత్రం వరుస సంఖ్య వేయాలి. అక్కడ విద్యార్థి పేరు, హాల్ టికెట్ నంబరు, పేపరు కోడ్, కేంద్రం పేరు ఉంటుంది. విద్యార్థి ముందుగా తన సమాచారం కరెక్ట్‌గా ఉందో లేదో సరిచూసుకోవాలి. లేకుంటే మరో బ్లాంక్ షీట్‌ను ఇన్విజిలేటర్‌ను సంప్రదించి తీసుకోవాలి. సమాధాన పత్రంపై బార్‌కోడ్ షీట్‌ను ఉంచి బార్‌కోడ్‌పై కుడివైపున స్టిక్కర్ ఉన్న చోట ఇన్విజిలేటర్ చేత పిన్ చేయించాలి. దానికి సమాధాన పత్రం కలిసేలా ఇన్విజిలేటర్ ఇచ్చిన స్టిక్కర్‌ను అతికించాలి.



పదో తరగతి విద్యార్థినులు

**పూర్తి స్థాయిలో నియామకం**



మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి స్థాయిలో చేపట్టాం. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావులేని విధంగా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చాం.

–నాయుడు రామచంద్రరావు, ఎంఈవో, మండపేట

**క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాం**



ప్రతి పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునేలా ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకుండా ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాం.

– మానుపూడి శ్రీనివాసు, ఎంఈవో, రామచంద్రపురం

### బార్ అసోసియేషన్ ఎన్నికలకు 12 నామినేషన్లు

రామచంద్రపురం: బార్ అసోసియేషన్ ఎన్నికలకు 12 నామినేషన్లు వచ్చినట్లు అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు మల్లిడి హరినాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవికి పిల్లి మురళీ వెంకటరమణరావు, ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యక్ష పదవికి పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ఎన్ శర్మ, కార్యదర్శికి చింతపల్లి శ్రీను, వాడ్రేవు సాయి ప్రసాద్, జుత్తుక నాగేశ్వరరావు, సాదే నారాయణరావు, జాయింట్ సెక్రటరీకి ఆళ్ల సుబ్రహ్మణ్యం, చిన్నం వీర్రెడ్డిలు నామినేషన్లు వేయగా కోశాధికారిగా జేఎస్ఎస్ చక్రవర్తి, జూనియర్స్ రిప్రజెంటేటివ్‌గా పీఎల్‌ఆర్‌పీ రామయ్య(పృథ్వీ), మహిళా రిప్రజెంటేటివ్‌గా కె.సత్యవాణిలు ఒక్కో నామినేషన్ మాత్రమే వేశారు. స్క్రూటినీ అనంతరం అన్ని నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి చలపతిరావు తెలియజేశారు. ఈనెల 5న నామినేషన్ల విత్ డ్రా, 11న ఎన్నిక జరగనుంది.

### ఇరువర్గాల మధ్య కొట్లాటపై కేసు

రామచంద్రపురం రూరల్: ఇంటి సరిహద్దు విషయమై వెలంపాలెంలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఏఎస్సై దుర్గాబాయి తెలిపారు. గ్రామంలోని నంగి వీరభద్రరావు, గుర్రాల వెంకటేశ్వరరావుకు సరిహద్దు విషయంలో తగాదా జరిగింది. వీరభద్రరావు, గుర్రాల మూర్తి, వీరబాబు, వెంకన్న, నానిలపై ఫిర్యాదు చేయగా గుర్రాల వెంకటేశ్వరరావు నంగి వీరభద్రరావు సత్తియ్య, వీరయ్యలపై ఫిర్యాదులు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## పేదరికమే ప్రామాణికంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



ఏడిదలో ఆసరా సాయం చెక్ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పాపారాయుడు తదితరులు

మండపేట: పేదరికమే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ఏడిద, వై.సీతానగరం, మెర్నిపాడు గ్రామాల్లోని వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు 3వ విడత రుణమాఫీ చెక్కును ఆయన అందజేశారు. ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన శనివారం ఏడిద రథం గుడి వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ తోట, పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల చెంతకే చేరుస్తున్నారన్నారు. పాపారాయుడు మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీకి భవిష్యత్తులో భారీ విజయాన్ని అందించాలని కోరారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, గారపాటి అశోక్‌కుమార్, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, పార్టీ నాయకులు పిల్లా వీరబాబు, పలివెల సుధాకర్, కుడిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**అర్తమూరులో ..**

మండలంలోని అర్తమూరు, తాపేశ్వరం, పాలతోడు, వెలగతోడు, ఇప్పనపాడు గ్రామాల ఆసరా లబ్ధిదారులకు రుణమాఫీ చెక్కు అందించారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన శనివారం అర్తమూరు శ్రీసత్యభాస్కర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తోట 350 స్వయం సహాయక సంఘాలకు రూ.11.47 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగుళ్ల జోగేశ్వరరావు అర్తమూరు అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబులు మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల్లోని పేదలను ఆదుకున్న ఏకైక సీఎం జగన్ అన్నారు. సర్పంచులు పిల్లా వెంకటలక్ష్మి, నలమామిడి కృపరాజు, వాసంశెట్టి రాజేశ్వరి, పార్టీ నాయకులు నాగిరెడ్డి రాంబాబు, చిర్ల శ్రీరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి, జయరామ్‌రెడ్డి, పిల్లా అరవరాజు, పిల్లా సూరిబాబు, మండ నాగిరెడ్డి, తిరుశూల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు ప్రకాష్‌బాబు

రాయవరం: ప్రస్తుత రబీలో మండలంలో 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్టు ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు సిబ్బందికి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14,651 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారన్నారు. తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సాధారణ రకం 75 కేజీల బస్తా రూ.1,530, ఏ గ్రేడ్ సన్న రకం 75 కేజీల బస్తా రూ.1,545 రేటు నిర్ణయించారన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతులు ధాన్యాన్ని అమ్ముకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో డి.శ్రీనివాసు సూచించారు. పీఏసీఎస్ సీఈవోలు, వీఆర్వోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం మండలంలో..**

కపిలేశ్వరపురం: మండలంలోని 17 గ్రామాల్లో ప్రస్తుత రబీ ధాన్యాన్ని ప్రణాళికాబద్ధంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. రబీ ధాన్యం కొనుగోళ్లపై పీఏసీఎస్‌ల సీఈఓలు, వీఆర్వోలు, సచివాలయ వ్యవసాయ సహాయకులు, కొనుగోలు కేంద్రాల్లోని సాంకేతిక సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సిబ్బంది విధులు, గణాంకాల నమోదు తదితర సాంకేతిక అంశాలను వివరించారు. వ్యవసాయ క్షేత్రం నుంచి రైస్ మిల్లుకు తరలించే వరకూ పాటించాల్సిన ప్రమాణాలపై అవగాహన కల్పించారు. కొనుగోలుకు కావాల్సిన గోనె సంచులు, ఇతర సామగ్రిని త్వరితగతిన సమకూర్చుకోవాలన్నారు. జట్టు కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీని సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘ పెద్దలు

రాయవరం: దేవాలయాల అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీ అన్నారు. చెల్లూరు గ్రామంలో శనివారం నిర్వహించిన సీతారామచంద్ర విగ్రహాల పూజల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో జీర్ణావస్థకు చేరిన శెట్టిబలిజ సంఘం సీతారామ ఆలయాన్ని నూతనంగా నిర్మించే క్రమంలో భాగంగా పాత విగ్రహాలను మరోచోట తాత్కాలిక ప్రతిష్ఠ చేశారు. సర్పంచ్ పాలిక రాఘవ, గోవిందు దంపతులు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలిక రాఘవగోవిందు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో పాటుగా, దాతల నుంచి సేకరించిన విరాళాలతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ వివరించారు. ఈ సందర్భంగా పృథ్వీని సర్పంచ్ రాఘవ గోవిందు, స్థానిక శెట్టిబలిజ సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

### గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



వెంటూరులో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు

రాయవరం: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాయవరం జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు అన్నారు. వెంటూరు గ్రామంలో శనివారం చేపట్టిన అభివృద్ధి పనుల కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో రూ.6.50 లక్షల మండల పరిషత్, జెడ్పీ నిధులతో నిర్మించే మూడు రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఆమె సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావుతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ నున్న కృష్ణప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న మురళీకృష్ణ

కె.గంగవరం: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సూచించారు. మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్ఫూర్తికరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని చిన్నతనం నుంచి విద్యలో రాణించాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన రాసిన రూ.10 వేలు విలువైన పుస్తకాలను విద్యార్థులకు అందించారు. హెచ్‌ఎం సీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

మండపేట: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం మండపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకున్నారన్నారు.

## మండపేటలో 89 శాతం పన్నుల వసూలు



అర్ధరాత్రి పన్నులు చెల్లిస్తున్న భవన యజమానులు

మండపేట: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) ముగిసేనాటికి మండపేట మునిసిపాలిటీలో 89 శాతం పన్నులు వసూలయ్యాయి. మొత్తం ఆస్తి పన్ను డిమాండ్ రూ.6.39 కోట్లు ఉండగా రూ.5.71 కోట్లు వసూలయ్యాయి. శుక్రవారం ఆర్థిక సంవత్సరానికి చివరి రోజు కావడంతో పాటు వడ్డీ రాయితీ గడువు ముగింపునకు ఆఖరి రోజు. భవన యజమానుల సౌలభ్యం కోసం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ వంక ప్రభాకర చౌదరి, రెవెన్యూ సిబ్బంది అర్ధరాత్రి 12 గంటల వరకూ మున్సిపల్ కార్యాలయంలోనే ఉండి పన్నులు కట్టించుకున్నారు. చివరి రోజున రూ.35 లక్షల వరకూ పన్నులు వసూలైనట్టు శనివారం ప్రభాకర చౌదరి తెలిపారు. గతేడాదితో పోలిస్తే రూ.5 లక్షలు అదనంగా వసూలయ్యాయన్నారు. జిల్లాలో పన్నుల వసూళ్లలో మండపేట ముందంజలో ఉన్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## కన్నులపండువగా వేంకటేశ్వరుని కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంలో కొలువైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఉదయం ధ్వజారోహణ, సాయంత్రం నాలుగు గంటలకు గరుడవాహనం, పల్లకీల్లో అమ్మవార్లను, స్వామికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి 6.30 గంటలకు కల్యాణ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ వేదికపైకి మేళతాళలతో తోడ్కొని వచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు అంగర శింగరాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. మొదట గణపతి పూజ, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ జరిపారు. అనంతరం సుముహూర్తంలో మాంగళ్యధారణ, తలంబ్రాలు, తంతును కమనీయంగా జరిపించారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఆయన తనయుడు నరేన్‌లు, స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ పెంకే కృష్ణవేణి, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మరుగుదొడ్లు నిర్మించరూ...



అంగర గాంధీ సెంటర్‌లోని బస్ షెల్టరు

కపిలేశ్వరపురం: మండలంలోని అనేక గ్రామాలకు ప్రధాన కూడలి అంగర గ్రామం. గ్రామంలోని గాంధీ సెంటర్ వద్ద బస్సులు, ఆటోల కోసం ఎదురు చూసేవారనేక మంది నిత్యం దర్శనమిస్తారు. గ్రామంలోని బ్యాంకులు, విద్యాలయాలు, నాలుగు కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రం కపిలేశ్వరపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళేవారితో సెంటర్ నిత్యం జన సంచారంతో సందడిగా ఉంటుంది. ప్రైవేట్ వ్యక్తుల చొరవతో అంగర కూడలిలో బస్ షెల్టర్ ఏర్పాటైంది. ఇంతటి ప్రాధాన్యం గాంధీ సెంటర్‌లో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చిన చీఫ్‌లు, డీవోలు



పసలపూడి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న ఎంఈవో సత్యనారాయణ

రాయవరం: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో వై.సత్యనారాయణ సూచించారు. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న తరుణంలో శనివారం రాయవరం, చెల్లూరు, పసలపూడి కేంద్రాల్లో ఇన్విజిలేటర్లతో ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు ఎంఈవో సత్యనారాయణ పలు సూచనలు చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందే విద్యార్థులను పూర్తిగా చెక్ చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లపై ఉందన్నారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ఇన్విజిలేటర్లకు చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష నిర్వహించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఇన్విజిలేటర్లు శనివారం మధ్యాహ్నం పరీక్ష కేంద్రాల్లో విధుల్లో చేరుతున్నట్లుగా డీఈవో ఇచ్చిన ఉత్తర్వులతో రిపోర్టు చేశారు. అలాగే చీఫ్, డీవోల పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాల్లో బెంచీలపై హాల్ టిక్కెట్లు నంబర్లు కేటాయించారు. కాగా మండలంలోని రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, భావ్యం, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల, చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 758 మంది పరీక్షలు రాయనున్నారు. ఇన్విజిలేటర్ల శిక్షణలో సీఎస్‌లు డి.సత్తిరాజు, పి.వెంకటేశ్వరరావు, పోలిశెట్టి రాంబాబు, వి.శాంతిసునీత, డీవోలు డి.జోసఫ్‌కుమార్, డి.త్రిమూర్తులు, ఆర్.శ్రీనివాసు, ఏఎస్‌టీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



కాజులూరులో కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న రాజుబాబు తదితరులు

కాజులూరు: ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీ బుధవారం జరగనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శనివారం రాజబాబు తదితర రైతు సంఘాల నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి ఛలో ఢిల్లీ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంచుతూ పలుచోట్ల అవగాహన సదస్సులు నిర్వహించారు.కాజులూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు సామాన్యులకు భారంగా మారుతున్నాయన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోగా ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగటంతో రైతులు వ్యవసాయ రంగం నుంచి దూరమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అల్లాడి నరసింహమూర్తి, కుడుపూడి భూచక్రం, నామ చంద్రరావు, నామ వెంకన్న, యాళ్ళ కృష్ణ, వనుం వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభీష్టానికి అనుగుణంగానే ప్రభుత్వ పాలన



పాతమంజేరులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: ప్రజాభీష్టానికి అనుగుణంగానే రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని పాతమంజేరు నుంచి మొగలిపాలెం వెళ్లే రహదారిలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ గుంటూరి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రహదారుల అభివృద్ధిపైనే గ్రామాల పురోగతి ఆధారపడి ఉందన్నారు. ఈ లింకురోడ్డు నిర్మాణం ద్వారా మంజేరు తదితర గ్రామాల ప్రజలు మండలంలోని ప్రధాన గ్రామమైన గొల్లపాలెం చేరుకునేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, పార్టీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ నాయకులు గండి వెంకటేశ్వరరావు, తాడి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీమా తక్షణసాయం రూ.10 వేల అందజేత

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడికి చెందిన పట్టపగలు వీరన్న (37) అనారోగ్యంతో గత నెల 30న మృతి చెందాడు. వెదురుమూడి కార్యదర్శి వెలగల లక్ష్మి ఆధ్వర్యంలోని సచివాలయం ఉద్యోగులు వెంటనే స్పందించి ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు. తక్షణ సాయంగా రూ.10 వేలను శుక్రవారం రాత్రి వెల్ఫేర్ అసిస్టెంట్ అరవపల్లి తాతయ్య చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చోడే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.